క్లుప్తంగా

బాబు మాటలపై పవన్ స్పందించాలి

వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి సర్కార్ పాలనలో సూపర్ సిక్స్ అమలు సాధ్యం కాదని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేమని చేతులెత్తేసిన చంద్రబాబు మాటలపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించాలని వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ అమలు చేయించే బాధ్యత నాది అని ఆనాడు పవన్ చెప్పాడని, దానిపై ఇప్పుడు స్పందించాలని ఆయన పేర్కొన్నారు. ఒక వైపు రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చార్జీలు పెంపు చేపట్టారని, అలాగే హెల్మెట్ లేకపోతే భారీగా చలానాలు కట్టించుకొంటున్నారన్నారు. అదేవిధంగా విద్యుత్ చార్జీల పెంపు, రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు, చలానాలు వసూళ్లు చేయడం సంపద సృష్టించడం అంటారా? అని ప్రశ్నించారు. జగన్ దగ్గర చంద్రబాబు, పవన్ ట్యూషన్ చెప్పించుకోవాలని ఎద్దేవా చేశారు. దావోస్‌లో చంద్రబాబుని చూసి పారిశ్రామికవేత్తలు పారిపోయారని, ఒక్కరూ కూడా ఎంఓయూలు చేసుకోలేదన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రూ.1.78 లక్షల కోట్లు ఎంఓయూలు చేసుకొని పండగ చేసుకుంటున్నారన్నారు. 40 ఏళ్ల అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబుని చూసి పారిశ్రామిక వేత్తలు ఎందుకు రాలేదో చెప్పాలన్నారు. పవన్ దావోస్ పెట్టుబడులపై మాట్లాడాలని, ఇది ప్రభుత్వ వైఫల్యం కదా? అని నిలదీశారు. ఏ పని చేయలేక, ఏ పని చేతకాక గుడ్డ కాల్చి జగన్‌పై వేసే ప్రయత్నం చంద్రబాబు చేస్తున్నారని దుయ్యబట్టారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): రామరాజ్య నగర్ సెక్షన్ 33/11 కేవీ కబేళా సబ్ స్టేషన్ పరిధి 11 కేవీ కామకోటినగర్ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ (విజయవాడ టౌన్) పి.రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, టీవీ కృష్ణారావు వీధి, ఆర్కే పబ్లిక్ స్కూల్ ఏరియా, కామకోటినగర్, మానవ మందిరం రోడ్, భవానీపురం కోళ్లఫారం రోడ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

2వ రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ స్టేట్ చెస్ టోర్నమెంట్‌ను ఫిబ్రవరి 2వ తేదీన కానూరులో స్కూట్స్‌పిన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ డైరెక్టర్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎం.రాజీవ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీలో తొలిసారిగా నిర్వహించనున్న చెస్ టోర్నమెంట్‌లో కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఈ టోర్నమెంట్‌లో మొదటి 20 మందికి నగదు బహుమతి, ప్రతి ఏజ్ గ్రూపులో మొదటి మూడు స్థానాలకు ప్రత్యేక బహుమతులు అందిస్తామని చెప్పారు. టోర్నమెంట్‌లో పాల్గొనే వారు శనివారం సాయంత్రం 6 గంటలలోపు తమ పేర్లను ఏపీ చెస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 97007 75220 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నూతన పారిశ్రామిక విధానంపై నేడు అవగాహన సదస్సు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): స్థానిక రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో బుధవారం ఉదయం 11.30 గంటలకు నూతన పారిశ్రామిక విధానం – మహిళలకు ప్రోత్సాహకాలు అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సదస్సులో ఆంధ్రప్రదేశ్ మీడియం స్మాల్ అండ్ మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్స్(ఎంఎస్ఎంఈ) డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.సుదర్శన్‌బాబు, ఏపీ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బి.వెంకటరావు, రాజేశ్వరీ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ కె.కనకదుర్గ, జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్.విద్యాకన్నా, తరుణీ తరంగాలు సంస్థ అధ్యక్షురాలు రావి శారద తదితరులు పాల్గొంటారన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన 64 మందికి జరిమానా

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు వివిధ ప్రదేశాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఒకటి, ఐదో ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న 64 మందిని సంబంధిత కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తులు వెంకటేశ్వర శర్మ, లెనిన్ బాబు వారికి జరిమానా విధించారు. మొత్తం 64 మందిలో 11 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు, మిగిలిన 53 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధించారు. ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నామని సీపీ తెలిపారు. వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని పేర్కొన్నారు.

ఆక్రమణలకు అడ్డా బీఆర్టీఎస్ ఎర్రకట్ట రోడ్డు

- భారీ వాహనాల అనధికార పార్కింగ్
- వాహనాల మధ్యనే మద్యం, గంజాయి విక్రయాలు, సేవనం
- పట్టించుకోని అధికారులు



ఎర్రకట్ట రోడ్డులో ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేసిన వాహనాలు

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): స్థానిక 34వ డివిజన్ పెజ్జోనిపేట పప్పుల మిల్లు సెంటర్‌లోని బీఆర్టీఎస్ ఎర్రకట్ట రోడ్డు ఆక్రమణలకు నిలయంగా మారింది. లక్షల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలం ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోతుంది. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోవటంతో రహదారి కుంచించుకుపోతుంది. కేదారేశ్వరపేటలో ఉన్న పండ్ల మార్కెట్‌కు నిత్యం వచ్చే భారీ వాహనాలను ఎర్రకట్ట రోడ్డులోనే నిలుపుతుండడంతో ఈ ప్రాంతం పార్కింగ్‌కు కేంద్రంగా మారింది. ఇక్కడే సరుకును ఎగుమతులు, దిగుమతులు చేస్తుండటంతో తమకు రాత్రి, పగలు కునుకు లేకుండా పోతుందని స్థానికులు వాపోతున్నారు.

అక్రమంగా వసూళ్లు..

స్థానికంగా ఉన్న కొందరు చోటా నాయకులు వాహనానికి వంద రూపాయల చొప్పున అక్రమంగా వసూళ్లకు పాల్పడుతూ వాహనాల అనధికార పార్కింగ్‌కు ప్రోత్సహిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. గతంలో ఇదేవిధంగా అనధికార పార్కింగ్, వసూళ్లను నివారించేందుకు స్థానిక కార్పొరేటర్ బండి పుణ్యశీల వాహనాలులోనికి ప్రవేశించకుండా ఇనుప గడ్డర్లను ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో కొందరు చోటా నాయకులు గడ్డర్లను తొలగించి భారీ వాహనాలు యథేచ్ఛగా వచ్చేలా చేశారు.

మద్యం, గంజాయి విక్రయాలు..

ఇక్కడ నిలిపే లారీలు, ట్రక్కులు, మినీ లారీల మధ్యనే కొందరు గంజాయి, మద్యం విక్రయిస్తున్నారు. వాటిని సేవించిన వారు మత్తులో చేసే గొడవలకు ఇళ్లల్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకుంటుందని స్థానికులు చెబుతున్నారు. వారు చేసే గొడవలతో మహిళలు, విద్యార్థినులు ఈ మార్గంలో నడవలేని పరిస్థితి ఎదురవుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని పోలీసులు..

పగలు, రాత్రీ తేడా లేకుండా ఇక్కడ బహిరంగంగా మద్యం, గంజాయి సేవిస్తూ, గొడవలు పడుతున్నా పోలీసులు పట్టించుకోక పోవటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల నిఘా లేక పోవటంతో వారు మరింత రెచ్చిపోతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా వీఎంసీ అధికారులు, పోలీసులు చొరవ తీసుకొని అక్రమ పార్కింగ్, మందుబాబులు, గంజాయి బ్యాచ్‌కు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకునే వారే లేరు..

ఒక వైపు లారీల్లో ఎగుమతులు, దిగుమతుల గోల, మరో వైపు గంజాయి, మద్యం సేవించి యువకులు చేసే గొడవలతో కంటి మీద కునుకు లేకుండా పోతుంది. మా సమస్యలను పట్టించుకునే వారే లేరు.

– మేరీ, స్థానికురాలు

రోడ్డుపై వెళ్లలేని పరిస్థితి

నిత్యం ఇక్కడ జరుగుతున్న గొడవలతో రోడ్డుపై వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. పిల్లలను పాఠశాలలకు, కాలేజీలకు పంపించాలంటే బస్టాప్ వరకు వెంటపెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది.

– ఝాన్సీ, స్థానికురాలు



ఆక్రమణలకు గురైనా ప్రభుత్వ స్థలం



వాహనాలు వచ్చేందుకు తొలగించిన గడ్డర్లు

నగర ప్రజల జీవనోపాధికి సిటీ లైవ్లీహుడ్ మిషన్



పటమట(విజయవాడతూర్పు): నగర ప్రజల జీవనోపాధి మెరుగుపడేలా నిపుణులు ప్రణాళికలను సిద్ధం చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర చెప్పారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో మంగళవారం కేంద్ర ప్రభుత్వ నేషనల్ అర్బన్ లైవ్లీ హుడ్ మిషన్ 2.0 పథకంలో భాగంగా నేషనల్ ఇనిస్టిట్యూట్ మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజ్(ఎన్ఐఎంఎస్ఎంఈ) నిపుణులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజల జీవనోపాధి మెరుగుపడేలా వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ, షెల్టర్ హోమ్ తదితర అంశాలపై నెలలోగా నివేదికను సమర్పించాలన్నారు. నివేదిక అనుగుణంగా నగర ప్రజల జీవనోపాధి మెరుగుపడేలా సిటీ లైవ్లీ హుడ్ యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రజల ఆర్థిక పురోగతి సాధించవచ్చని తెలిపారు. ప్రణాళికను త్వరితగతిన పూర్తి చేసి తనకు సమర్పించాలని నిపుణులైన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫ్యాకల్టీ మెంబర్ రాజేంద్ర ప్రసాద్‌ను ఆదేశించారు. సమావేశంలో విజయవాడ నగరపాలకసంస్థ పట్టణ సామాజికాభివృద్ధి విభాగం ప్రాజెక్టు ఆఫీసర్(యూసీడీ) పి.వెంకటనారాయణ, అసిస్టెంట్ ఫ్యాకల్టీ మెంబర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎగ్జిబిషన్-2025



చీరను ప్రదర్శిస్తున్న మహిళ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): దేశంలోని పలు రాష్ట్రాల సంప్రదాయాలు, సంస్కృతులను కలబోసిన చేనేత మగ్గాలపై నేసిన చీరలను నేషనల్ సిల్క్ ఎక్స్‌పో –ఎగ్జిబిషన్ కమ్ సేల్–2025 పేరుతో నగర వాసులకు అందుబాటులోకి తెచ్చామని ఎగ్జిబిషన్ నిర్వాహకులు తెలిపారు. స్థానిక లబ్బీపేటలోని ఎ-కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం ఈ ఎగ్జిబిషన్ కమ్ సేల్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వివాహ వేడుకలకు సంప్రదాయం, ఆధునీకత మేళవించిన వస్త్రాలను ఈ ప్రదర్శనలో ఉంచామన్నారు. ఎక్స్‌పోలో చీరలు, దుపట్టాలు, సల్వార్ మెటీరియల్ వివిధ డిజైన్లు పలు మోడల్స్‌లో ఉన్నాయన్నారు. బిహార్ వారి టస్సార్, మట్కా, భాగల్పూర్ సిల్క్ చీరలు, గుజరాతీ సంప్రదాయ బంధిని, కచ్ ఎంబ్రాయిడరీ పటోలా చీరలు, తమిళనాడుకు చెందిన కాంచీవరం చీరలతో పాటు ఎంబ్రాయిడరీ సిల్క్ చీరలు, జమ్ము – కాశ్మీర్ తాబీ సిల్క్ చీరలు ప్రదర్శనలో ఉన్నాయని తెలిపారు. బెనారస్ పట్టు చీరలు, జమ్దానీ, షిఫాన్ చీరలు, ఉత్తరప్రదేశ్ లక్నవి చికాన్ వర్క్ చీరలు, రాజస్థాన్ బంధిని, బంధేజ్, హ్యాండ్–బ్లాక్ ప్రింట్లు అందుబాటులో ఉంచామన్నారు. ఎగ్జిబిషన్ కమ్ సేల్ ఈ నెల 30వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని చెప్పారు.

సూర్య ఘర్ యోజన ప్రయోజనాలను పొందండి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుహాసిని



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా అనేక ప్రయోజనాలను పొందవచ్చని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.సుహాసిని పేర్కొన్నారు. గొల్లపూడిలోని గ్రామ సచివాలయం వద్ద మంగళవారం సూర్య ఘర్ యోజన పథకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పథకం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవడంతో ప్రతి నెలా వచ్చే విద్యుత్ బిల్లు తగ్గించుకోవచ్చని తెలిపారు. అనంతరం జగ్గయ్యపేట డివిజన్‌లోని పెనుగంచిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జరుగుతున్న ఎన్‌సీడీ–సీడీ సర్వేను ఇంటింటికీ వెళ్లి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సుజని, సీహెచ్ఓలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు అన్నారు. ప్రభుత్వం సోలార్ విద్యుత్‌కు సంబంధించి అందజేస్తున్న పథకాలు, రాయితీ అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విద్యుత్ సిబ్బంది మంగళవారం పాత బస్తీలో ర్యాలీని నిర్వహించారు. సోలార్ విద్యుత్ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని అప్పాజీరావు సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ కొత్తపేట ఏఈ జయంత్, సిబ్బంది పాల్గొన్నారు.

భారతదేశ రాజ్యాంగం విశిష్టమైంది



సెమినార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రపంచ ప్రజాస్వామిక దేశాలలో భారత రాజ్యాంగం విశిష్టమైందని, అటువంటి గొప్ప రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం గణతంత్ర దినోత్సవ ప్లాటినం జూబ్లీ సందర్భంగా భారత రాజ్యాంగం – ఒక సజీవ పత్రం అనే అంశంపై సెమినార్ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణరావు మాట్లాడుతూ.. అనేక దేశాల రాజ్యాంగాలు అధ్యయనం చేసి మన స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేట్లు మన దేశ రాజ్యాంగం రూపొందించారన్నారు. ప్రముఖ న్యాయవాది, ఆలిండియా లాయర్స్ యూనియన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. దేశంలో ఫెడరల్ వ్యవస్థ నిలదొక్కుకుని రాష్ట్రాల సమాఖ్యగా దేశం పురోగమించటానికి బాట వేసిందన్నారు. పౌరులకు కల్పించిన బాధ్యతలను, హక్కులను గుర్తు చేసుకుని వ్యవహరించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు రచించిన పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తులసిరావు, సీహెచ్ కళాధర్, జి.కిశోర్‌కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన సైన్స్ ఎక్స్‌పో



ప్రదర్శనను వివరిస్తున్న విద్యార్థులు



పక్షికి ఇస్తున్న ఫీడింగ్‌ను తిలకిస్తున్న విద్యార్థినులు

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థినుల్లో ఉన్న సృజనాత్మక శక్తిని, టాలెంట్‌ను ప్రదర్శించేందుకు ఎక్స్ పోను నిర్వహించినట్లు స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జసింత క్వాడ్రస్ తెలిపారు. స్టెల్లా కళాశాల సైన్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పార్క్స్–2కె25 సైన్స్ ఎక్స్‌పోను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వినూత్నమైన ఆవిష్కరణలు మరిన్ని రావాలని అందుకు విద్యాసంస్థలు పునాదులు వేయాలన్నారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియెట్ విద్యార్థులు రూపొందించిన కెమిస్ట్రీ, ఫిజిక్స్, బోటనీ, జువాలజీ, గణిత శాస్త్రాలకు సంబంధించి 60 ప్రయోగాలను ప్రదర్శనలో ఉంచారు. కళాశాల కరస్పాండెంట్ లీనా క్వాడ్రస్, యాక్టివిటీస్ డైరెక్టర్ డాక్టర్ సిస్టర్ రేఖ, కళాశాల ఇంటర్ వైస్ ప్రిన్సిపాల్ స్వప్న వున్నం, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ ఉషాకుమారి, అధ్యాపకులు పద్మావతి, జావళి, శాంతకుమారి ఉమ, షేరా కుమారి కిరణ్మయి, జీవిత, శిరీష, శ్రావణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



భవానీపురం(విజయవాడపశ్చిమ): నాయీబ్రాహ్మణుల అభ్యున్నతి, సంక్షేమానికి కృషి చేస్తామని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) చెప్పారు. ఏపీ నాయీబ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన రుద్రకోటి సదాశివం, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం కార్యక్రమం మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ.. నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లను అభినందిస్తూ నాయీబ్రాహ్మణ సామాజికవర్గం అభ్యున్నతికి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డ్ సభ్యులు శాంతారామ్, టీడీపీ నాయకులు జంపాల సీతారామయ్య, గన్నె ప్రసాద్, జి.రఘురామరాజు, పరుచూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణతో సైన్యంలో ఉద్యోగం



భవానీపురం(విజయవాడపశ్చిమ): పాఠశాల స్థాయిలో నేషనల్ కేడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ)లో శిక్షణ పొందితే భవిష్యత్‌లో సైన్యంలో ఉద్యోగం పొందేందుకు ఉపయుక్తంగా ఉంటుందని 17 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ జీసీ పాండే అన్నారు. అదే విధంగా ఎన్‌సీసీ శిక్షకులకు విద్య, ఉద్యోగాల్లో నిర్వహించే ప్రవేశ పరీక్షలకు బోనస్ మార్క్‌లు ఇస్తారన్నారు. ఎన్‌సీసీ యూనిట్ల తనిఖీల్లో భాగంగా ఆయన విద్యాధరపురంలోని బెజవాడ రాజారావు హైస్కూల్‌ను మంగళవారం సందర్శించారు. ఆన్‌లైన్‌లో కేడెట్ రెజిమెంటల్ నంబరు నమోదు, బ్యాంక్ అకౌంట్ విధిగా ఉండాలన్నారు. ఎన్‌సీసీ విద్యార్థులు చేసిన కవాతును పరీక్షించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ మహేంద్ర సింగ్, స్కూల్ కరస్పాండెంట్ బెజవాడ రాజారావు, సెక్రటరీ శ్యామ్, ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, ఎన్‌సీసీ కేర్ టేకర్ సందీప్ కుమార్ పాల్గొన్నారు.

దుర్గమ్మ పంచ హారతుల్లో ప్రొటోకాల్ వివాదం



అజయ్‌కుమార్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం ప్రొటోకాల్ వివాదం చోటుచేసుకుంది. అమ్మవారి పంచహారతుల సేవలో పాల్గొనేందుకు టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్ కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆయనకు ప్రొటోకాల్ పాటించకపోవడంతో ఆలయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ అధికారులకు ముందుగానే సమాచారం ఇచ్చి రూ.5 వేలతో 10 పంచ హారతుల టికెట్లు కొనుగోలు చేశారు. అయితే అమ్మవారి పంచహారతుల సమయంలో ఆలయ అధికారులు ప్రొటోకాల్ పాటించకుండా అజయ్‌కుమార్ కుటుంబీకులను మూడో లైన్‌లో నిల్చోబెట్టారు. బంగారు వాకిలిలో అనధికార ప్రొటోకాల్ వ్యక్తులకు ప్రాధాన్యత ఇచ్చి తమను కనీసం పట్టించుకోకపోవడంతో, ఆలయ సిబ్బంది ఇష్టానుసారంగా కేకలు వేస్తుండటంతో అసహనానికి గురైన అజయకుమార్ హారతుల నుంచి బయటకు వచ్చేశారు. ఆయన నేరుగా దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఫోన్ చేసి ఆలయంలో తన కుటుంబానికి జరిగిన అవమానం గురించి ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ నుంచి నగరానికి విచ్చేస్తున్న మంత్రి నేరుగా ఇంద్రకీలాద్రికి విచ్చేసి అజయ్‌కుమార్‌తో మాట్లాడారు. ప్రొటోకాల్ విభాగంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మంత్రి.. అజయ్‌కుమార్‌కు మరో మారు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి, పట్టు వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. ఆలయ ప్రాంగణంలోని డోనర్ సెల్‌లో ఆయన లిఖిత పూర్వకంగా మంత్రికి ఫిర్యాదు చేశారు. దీనిపై సీఎంకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. దేవస్థానంలో ఈవోతో పాటు డీఈవో, ఏఈవోలు ప్రొటోకాల్ చూస్తుంటారు. అయితే మంగళవారం కొంత మందికి వీక్ ఆఫ్, మరి కొంత మంది అధికారులు కమిషనర్ కార్యాలయంలో జరిగే ఫంక్షన్‌కు వెళ్లినట్లు సమాచారం.

నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావాలి

న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా



మహాప్రస్థానం నాటికలోని ఓ సన్నివేశం

విజయవాడకల్చరల్: తెలుగు నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావాలని ప్రముఖ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. తపస్వి కల్చరల్ ఆర్ట్స్, ఆంధ్ర నాటక కళా పరిషత్, కొడాలి బ్రదర్స్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 8వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటకోత్సవాలు రెండవ రోజుకు చేరుకున్నాయి. మంగళవారం నాటి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గుప్తా మాట్లాడుతూ నాటకం తెలుగు వారి ఆత్మ అని అభివర్ణించారు. గురజాడ, కందుకూరి లాంటి నాటక రచయితలు నాటకానికి సామాజిక ప్రయోజనం ఉందని రుజువు చేశారన్నారు. కార్యక్రమంలో నన్నపనేని నాగేశ్వరరావు, పరుచూరి అజయ్‌కుమార్ సంస్థ వ్యవస్థాపకుడు సూర్యదేవర జగన్నాథరావు, వివిధ రంగాలకు చెందిన పువ్వాడ సుధాకర రావు, వల్లభనేని రాజేశ్వరి, బోడి ఆంజనేయరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రచయిత డాక్టర్ పొట్లూరి సుబ్రహ్మణ్యంను ఆత్మీయంగా సత్కరించారు. నాటకోత్సవాలలో భాగంగా యం.సంజీవి నాటకీకరణ చేసి, పిళ్ళా నటరాజ్ దర్శకత్వం వహించిన మహాప్రస్థానం నాటికను ప్రదర్శించారు. మహాప్రస్థానమంటే చివరి ప్రయాణం, మరో అర్థం భస్మ సింహాసనం. జీవిత పోరాటంలో మనిషి చాలా సందర్భాలలో వలస పోతున్నాడు. చావుకు, బతుక్కు మధ్య నలిగిపోయిన వ్యక్తుల జీవన పోరాటమే మహాప్రస్థానం. రెండవ నాటికగా ఓ కాశీవాసా రావయ్య నాటికను ప్రదర్శించారు.

అమ్మమ్మపై కర్రతో దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటికి ఆలస్యంగా వచ్చావని ప్రశ్నించిన అమ్మమ్మపై మనవడు కర్రతో దాడికి పాల్పడిన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పి.నైనవరం రెడ్డి బజార్‌కు చెందిన షేక్ అమీనాబీకి ఇద్దరు ఆడపిల్లలు. పెద్ద కుమార్తె నూర్జహాన్‌కు వివాహం కాగా బెంగళూరులో బిర్యానీ హోటల్ నడుపుతుంటారు. రెండేళ్ల కిందట నూర్జహాన్‌కు ప్రమాదం జరగడంతో తన కుమారుడి(17తో కలిసి తల్లి వద్దకు వచ్చింది. నూర్జహాన్ కుమారుడు చెడు వ్యసనాలకు బానిస కావడంతో అమీనాబీ మందలించింది. ఈ నెల 25వ తేదీ రాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చిన బాలుడు కర్రతో దాడి చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ క్యారీబ్యాగ్స్ నిషేధంపై ప్రత్యేక డ్రైవ్

పటమట(విజయవాడతూర్పు): సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ క్యారీబ్యాగ్స్ వాడకం నిషేధంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని వీఎంసీ ప్రజారోగ్య విభాగం ఇన్‌చార్జి ప్రధాన అధికారి డాక్టర్ సురేష్‌బాబు ఆ విభాగం అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలో ఉన్న సమావేశపు హాలులో కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు మంగళవారం సింగిల్ యూజ్డ్ క్యారీబ్యాగులపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ నగరంలోని మార్కెట్లు, వ్యాపార సముదాయాలు, ఇతర వర్తక ప్రాంతాల్లో 120 మైక్రోన్ల లోపు ఉన్న క్యారీ బ్యాగులు ఎక్కడున్నా, ఎవరు వినియోగించినా, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో వ్యర్థపదార్థాల నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించరాదని చెప్పారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణలో మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని, అధికారులు అప్రమత్తంగా ఉంటూ సిబ్బందిని పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్(ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రామ కోటేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్‌రెడ్డి, బయాలజిస్ట్ సూర్యకుమార్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.